@netifocusnews @focustv
https://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: ఎం. తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | మంగళవారం, 06 ఫిబ్రవరి 2024 | పేజీలు - 4



## సీఎం నిర్ణయాలపై..
# తెలంగాణవాదుల్లో సానుకూలత

2లో

- జయజయహే రాష్ట్రగీతంగా మార్చడంపై హర్షాతిరేకాలు
- జాతి అస్తిత్వం కోసమే అంటూ రేవంత్ ట్వీట్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంచలన నిర్ణయాలు తీసుకుంటూ వార్తల్లో నిలుస్తోంది. తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు కూడా ప్రభుత్వ నిర్ణయాలపై సానుకూలంగా స్పందిస్తున్నారు. కేబినెట్ సమావేశంలో రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయాలు ప్రస్తుతం రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా నిలిచాయి.

– నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్



# TS కాదు TG
## రేవంత్ సంచలన నిర్ణయం!

- మార్గదర్శకాలు రూపొందిస్తున్న రవాణాశాఖ
- పాత నంబర్లు యధావిధిగా ఉంటాయంటున్న అధికారులు

వివరాలు 2లో

తెలంగాణ మంత్రిమండలి సమావేశంలో తెలంగాణకు సంబందించి వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లలో రాష్ట్రం పేరును టీఎస్‌కు బదులుగా టీజీగా మార్చాలని నిర్ణయించచింది. దీంతో వాహనాల నంబర్ ప్లేట్లపై ఇక నుంచి టీఎస్‌కు బదులుగా టీజీ ఉండనుంది. ఈ మేరకు రవాణా శాఖ గైడ్‌లైన్స్ కూడా సిద్ధం చేస్తోంది. మరో రెండు మూడు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల కానున్నాయి. వాహనదారులపై భారం పడకుండా రవాణా శాఖ చర్యలు తీసుకుంటోంది. కాగా తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 1.50 కోట్లకు పైగా వాహనాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు కొత్తగా 10 వేల నూతన వాహనాల రిజిస్ట్రేషన్స్ జరుగుతున్నాయి. అయితే ఇకపై కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వాహనాల నంబర్ ప్లేట్లపై మాత్రమే టీజీగా మార్చే యోచనలో అధికారులు ఉన్నారు.

– నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్

## నేడు తెలంగాణ భవన్‌కు
# కెసిఆర్

కృష్ణాబోర్డుకు ప్రాజెక్టుల అప్పగింతపై సమీక్ష



2

# ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు

## ఈడీ పిటిషన్‌పై విచారణ 16కు వాయిదా

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవిత ఈడీ కేసు పిటిషన్‌పై విచారణ ఈనెల 16వ తేదీకి వాయిదా పడింది. అదే రోజున తుది విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది.



2



## అసెంబ్లీలో ఇక
# జలయుద్ధం

- సిద్ధం అవుతున్న అధికార విపక్షాలు
- కాంగ్రెస్ సవాళ్లపై ఘాటుగానే స్పందించిన బీఆర్ఎస్
- తగు విధంగా సమాధానం ఇస్తామన్న హరీష్

తెలంగాణలో రాజకీయాలు క్రమంగా వెక్కనున్నాయి. అధికార, విపక్షాల మధ్య జల జగడం రాజుకునే అవకాశం ఉంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జలయుద్ధం జరిగేలా ఉంది. సిఎం రేంవత్ రెడ్డి జలదోపిడీపై సవాళ్లు విసిరారు. చర్చకు సిద్ధం అని ప్రకటించారు. ఇందుకు మాజీమంత్రి హరీష్‌రావు కూడా సై అన్నారు. అసెంబ్లీలో కడిగి పారేస్తామని హెచ్చరించారు.

– నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్

## అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల
# బండారం బయటపెడతాం

- మాజీ సీఎస్ సోమేశ్ బూబాగోతం కూడా వెల్లడిస్తాం
- కమీషన్ల కోసమే కేసీఆర్ కాళేశ్వరం నిర్మాణం
- బీఆర్ఎస్ నేత విమర్శలపై మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి

2






## రాజకీయ ప్రచారానికి
# పిల్లలను దూరంగా ఉంచాలి
## కేంద్ర ఎన్నికల సంఘం

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం ఇవాళ కీలక ప్రకటన జారీ చేసింది. రాజకీయ పార్టీలకు ఈసీ వార్నింగ్ ఇచ్చింది. రాజకీయ ప్రచారం కోసం పార్టీలు కానీ అభ్యర్థులు కానీ చిన్న పిల్లలను వాడకూడదని ఈసీ పేర్కొన్నది. ర్యాలీలు, ప్రచారం, ప్రకటనల్లో పిల్లలను దూరంగా ఉంచాలని ఈసీ తన ప్రకటనలో వెల్లడించింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈసీ ఈ ప్రకటన విడుదల చేసినట్లు తెలుస్తోంది. పోస్టర్లు, పాంప్లెట్ల పంపిణీ కానీ, నినాదాలు చేయడానికి కూడా పిల్లలను వాడకూడదని ఈసీ తెలిపింది. ర్యాలీల సమయంలో తమతో పాటు చిన్న పిల్లలను తీసుకువెళ్లరాదు అని పేర్కొన్నది. ఈ నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈసీ వెల్లడించింది.



# టీఎస్ కాదు టీజీ

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,ఫిబ్రవరి5:** తెలంగాణ మంత్రిమండలి సమావేశంలో తెలంగాణకు సంబంధించి వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లలో రాష్ట్రం పేరును టీఎస్‌కు బదులుగా టీజీగా మార్చాలని నిర్ణయించచింది. దీంతో వాహనాల నంబర్ ప్లేట్లపై ఇక నుంచి టీఎస్‌కు బదులుగా టీజీ ఉండనుంది. ఈ మేరకు రవాణా శాఖ గైడ్‌లైన్స్ కూడా సిద్ధం చేస్తోంది. మరో రెండు మూడు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల కానున్నాయి. వాహనదారులపై భారం పడకుండా రవాణా శాఖ చర్యలు తీసుకుంటోంది. కాగా తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 1.50 కోట్లకు పైగా వాహనాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు కొత్తగా 10 వేల నూతన వాహనాల రిజిస్ట్రేషన్స్ జరుగుతున్నాయి. అయితే ఇకపై కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వాహనాల నంబర్ ప్లేట్లపై మాత్రమే టీజీగా మార్చే యోచనలో అధికారులు ఉన్నారు. దీంతో ప్రస్తుతం టీఎస్‌గా ఉన్న నెంబర్ ప్లేట్లు కొనసాగనున్నాయి. అలాగే విభజన అనంతరం ఇంకా ఏపీ నెంబర్ ప్లేట్లతోనే 30 లక్షల వాహనాలు కొనసాగుతున్నాయి. అయితే ఇప్పటికే ఉన్న నెంబర్లు ప్లేట్లు అన్నీ మార్చుకోవాలా అన్న చర్చ నడుస్తుంది. ఇప్పటి వరకు ఉన్న అనధికారిక సమాచారం మేరకు టీఎస్ నెంబర్ ప్లేట్లను మార్చుకోవాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం జీవో ఇచ్చిన తర్వాత.. అప్పటి నుంచి కొత్తగా రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాలకు టీజీ కేటాయిస్తారు. ఏపీ పోయి.. టీఎస్ వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ అయిన వాహనాల నెంబర్లను మార్చు కోవాల్సిన అవసరం లేదు. అవి యధావిధిగా కొనసాగుతాయి. కొత్తగా వచ్చిన వాహనాలకు మాత్రమే టీజీ కేటాయిస్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇదే పద్దతి కొనసాగింది. అప్పటి వరకు ఉన్న ఏపీ రిజిస్ట్రేషన్లు యధావిధిగా కొనసాగాయి. ఇప్పుడు కూడా అంతే అంటున్నారు కొందరు అధికారులు. ప్రభుత్వం జీవో వచ్చిన తర్వాత నుంచి రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాలకు మాత్రమే టీజీ ఉంటుంది. అలా కాకుండా తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత టీఎస్ పేరుతో ఉన్న వాహనాల నెంబర్లు ప్లేట్లు మార్చాలి పెద్ద తలనొప్పిగా మారుతుందని.. కొన్ని లక్షల వాహనాలు ఉంటాయని.. అవన్నీ మార్చాలంటే కష్టం అంటున్నారు. ప్రస్తుతానికి అయితే టీఎస్ నెంబర్ ప్లేట్లను టీజీగా మార్చుకోవాల్సిన అవసరం లేదనేది కొందరు అధికారుల మాట.. బయట ప్రచారం జరుగుతున్నట్లు టీఎస్ నెంబర్ ప్లేట్లను టీజీ మార్చుకోవాల్సిన అవసరం లేదు.. మార్చుకోవాల్సిన అవసరం ఏదైనా ఉంది అంటే.. అప్పుడు అధికారికంగా ప్రకటిస్తారని.. అప్పటి వరకు వాహనదారులు ఎవరూ తమ నెంబర్ ప్లేట్లను టీజీగా మార్చుకోవద్దని సూచిస్తున్నారు అధికారులు.

## సీఎం నిర్ణయాలపై తెలంగాణవాదుల్లో సానుకూలత

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,ఫిబ్రవరి5:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంచలన నిర్ణయాలు తీసుకుంటూ వార్తల్లో నిలుస్తోంది. తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు కూడా ప్రభుత్వ నిర్ణయాలపై సానుకూలంగా స్పందిస్తున్నారు. కేబినెట్ సమావేశంలో రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయాలు ప్రస్తుతం రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా నిలిచాయి. 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించడం.. అలాగే వాహన రిజిస్ట్రేన్లలో ఇక నుంచి టీఎస్ బదులు టీజీగా మారుస్తూ మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తెలంగాణలో కాంగ్రెస్ హయాంలో మారుతున్న విధానాలు, కేబినెట్‌లో తీసుకున్న సంచలన నిర్ణయాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఒక జాతి అస్థిత్వానికి చిరునామా ఆ జాతి భాష, సాంస్కృతిక వారసత్వమే. ఆ వారసత్వాన్ని సమున్నతంగా నిలబెట్టాలన్న సదుద్దేశంతో ముందుకు వెళ్తున్నాం. 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించాం. సగటు తెలంగాణ ఆడబిడ్డ రూపురేఖలే తెలంగాణ తల్లి విగ్రహానికి ప్రతిరూపంగా తెలంగాణ తల్లిని రూపొందిస్తాం. రాచరికపోకడలు లేని చిహ్నమే రాష్ట్ర అధికారిక చిహ్నం రూపొందిస్తాం. వాహన రిజిస్ట్రేషన్లలో టీఎస్ బదులు ఉద్యమ సమయంలో ప్రజలు నినదించిన టీజీ అక్షరాలు ఉంటాయి. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకే మా నిర్ణయాలు. ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

# నేడు తెలంగాణ భవన్‌కు కెసిఆర్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,ఫిబ్రవరి5:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం తెలంగాణ భవన్‌కు రానున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తొలిసారిగా కేసీఆర్ తెలంగాణ భవన్‌కు వస్తున్నారు. ఉదయం 11 గంటలకు కృష్ణా పరివాహక ప్రాంతంలో ఉన్న ఉమ్మడి జిల్లాల నేతలతో బీఆర్ఎస్ అధినేత సమావేశం కానున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ముఖ్యనేతలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. కృష్ణా బేసిన్‌లో ఉన్న ఉమ్మడి ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడంపై భవిష్యత్ కార్యచరణపై చర్చించనున్నారు. అసెంబ్లీ సమావేశాలు, క్యాబినెట్‌లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై బీఆర్ఎస్ నేతలు చర్చ జరుపనున్నారు. అలాగే అసెంబ్లీ సమావేశాల తర్వాత నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభకు సంబంధించి రేపటి సమావేశంలో గులాబీ నేతలు చర్చించనున్నారు.

### ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు

## ఈడీ పిటిషన్‌పై విచారణ 16కు వాయిదా

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి5:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కవిత ఈడీ కేసు పిటిషన్‌పై విచారణ ఈనెల 16వ తేదీకి వాయిదా పడింది. అదే రోజున తుది విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. విచారణ సందర్భంగా ఈడీ నోటీసులకు కవిత హాజరుకావడంలేదని సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చిన అడిషినల్ సొలిసిటర్ జనరల్. ఈ ?క్రమంలో ఈడీ నోటీసులను సవాల్ చేయడం వల్లే హాజరుకాలేదని చెప్పిన కవిత తరపు లాయర్ కపిల్ సిబల్. అనంతరం, కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అభిషేక్ బెనర్జీ, నళిని చిదంబరం, కవిత కేసులను ఉమ్మడిగా విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈనెల 16వ తేదీన తుది వాదనలకు సిద్ధంగా ఉండాలని కోర్టు సూచించింది. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కవితను పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. దీంతో, ఈడీ విచారణపై కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో లిక్కర్ కేసులో తనకు ఈడీ ఇచ్చిన సమన్లు రద్దు చేయాలని పిటిషన?? దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి తనపై ఎలాంటి బలవంతపు చర్యలు ఈడీ తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం కోర్టును కవిత కోరారు.

## బీసీ సంక్షేమానికి 20వేల కోట్లు కేటాయించాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కవిత లేఖ



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,ఫిబ్రవరి5:** బీసీ సంక్షేమం కోసం 2024-25 బడ్జెట్లో రూ.20 వేల కోట్లు కేటా యించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమాకుఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం మంత్రికి ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ చేర్చిందని గుర్తు చేశారు. అంతేకాకుండా, బీసీ సంక్షేమానికి రానున్న ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, ఎంబీసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని కూడా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని ప్రస్తావించారు. అలాగే, ప్రతి జిల్లా కేంద్రంలో రూ.50 కోట్ల వ్యయంతో ప్రొఫెసర్ జయశంకర్ బీసీ ఐక్యత భవనాలను నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో బీసీల సంక్షేమం కోసం ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలని కోరారు. ఈ నిధుల కేటాయింపు ద్వారా కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చినట్లవుతుందని, బీసీలు మరింత అభివృద్ధి చెందడానికి ఈ నిధులు దోహదపడుతాయని అభిప్రాయపడ్డారు. బీసీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పనిచేయాలని, అందుకు బీసీలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో ఇక జలయుద్ధం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,ఫిబ్రవరి5:** తెలంగాణలో రాజకీయాలు క్రమంగా వెక్కనున్నాయి. అధికార, విపక్షాల మధ్య జల జగడం రాజుకునే అవకాశం ఉంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జలయుద్ధం జరిగేలా ఉంది. సిఎం రేంవత్ రెడ్డి జలదోపిడీపై సవాళ్లు విసిరారు. చర్చకు సిద్ధం అని ప్రకటించారు. ఇందుకు మాజీమంత్రి హరీష్‌రావు కూడా సై అన్నారు. అసెంబ్లీలో కడిగి పారేస్తామని హెచ్చరించారు. మొత్తంమీద ఈ అంశం రానున్న అసెంబ్లీలో వాడీవేడీ చర్చలకు, వాగ్వాదాలకు దారితీసే అవకాశం ఉంది. ఈ క్రమంలో కృష్ణా జలాలపై సై అంటే సై అంటున్నాయి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు. ప్రాజెక్టుల అప్పగింత, నీళ్ల కేటాయింపులపై అసెంబ్లీ వేదికగా బిగ్ ఫైట్‌కు సిద్ధం అయ్యాయి. ఈ రకంగా వచ్చే అసెంబ్లీ వేదికగా తెలంగాణలో మరోసారి జలయుద్ధానికి సిద్ధం అయ్యాయి అధికార, విపక్షాలు. కృష్ణా జలాలపై కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య వార్ ఆఫ్ వర్డ్స్ జరిగాయి. కేంద్రంతో లాలూచీ పడి ప్రాజెక్టులు అప్పగించారని బీఆర్ఎస్ విమర్శిస్తే.. అందుకు బీజం వేసిందే మీరంటూ.. స్వయంగా సీఎం రేవంతే కౌంటర్ ఇచ్చారు. 60 ఏళ్లలో జరగని అన్యాయం.. తెలంగాణకు పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జరిగిందన్నారు. కేసీఆర్ హయాంలోనే.. ఏపీలో కొత్త ప్రాజెక్టులు వచ్చాయన్నారు సీఎం రేవంత్. పోతిరెడ్డిపాడు, మచ్చుమర్రి.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ లాంటివి కడుతుంటే కేసీఆర్ ఏం చేశారని ప్రశ్నించారు. కృష్ణా నీళ్లు శ్రీశైలం చేరకముందే.. తోడుకుపోయేలా ఏపీ సీఎం జగన్ ఎత్తులు వేస్తే.. ఇంటికి పిలిచి పంచభక్ష పరమాన్నాలతో భోజనాలు పెట్టారన్నారు రేవంత్. కేసీఆర్ ఇంట్లోనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ జీవో తయారైందని ఆరోపించారు. ప్రాజెక్టుల అప్పగింతకు, 299 టీఎంసీల వాటాకు కేసీఆర్ అంగీకరించారని.. వీటిపై అసెంబ్లీ వేదికగా చర్చిద్దామని సవాల్ విసిరారు. రేవంత్ సవాల్‌కు స్పందించిన హరీష్‌రావు.. అసెంబ్లీలో దిమ్మతిరిగే సమాధానం ఇస్తామన్నారు. చర్చకు తాము సిద్ధమని.. కాంగ్రెస్ బండారం అసెంబ్లీలోనే బయట పెడతామన్నారు హరీష్. మామ అల్లుళ్లు కలిసి తెలంగాణకు అన్యాయం చేశారని కేసీఆర్, హరీష్‌రావుపై రేవంత్ విమర్శలు చేస్తే.. తెలంగాణకు అన్యాయం చేసే బిల్లు పెట్టిందే.. మీ మామ అంటూ హరీష్ కౌంటర్ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ముందు కృష్ణా జలాల వివాదం తెలంగాణలోని అధికార-విపక్షాల అస్త్రంగా మారింది. తప్పు మీదంటే మీదని ఇప్పటికే మాటల తూటాలు పేలుతున్నాయి. అసెంబ్లీలోనే తేల్చుకుందాం అంటూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సవాళ్లు చేసుకున్నాయి. ఈ నెల 8 నుంచి జరిగే బ్జడెట్ సమావేశాల్లో.. కృష్ణా నీళ్లపై హాట్ హాట్ డిస్కషన్ జరిగే అవకాశం ఉంది.మరోవైపు కృష్ణా ప్రాజెక్టుల వివాదం, సీఎం రేవంత్ వ్యాఖ్యలపై కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. కృష్ణా నదీ జలాలపై రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న వైఖరిని కేసీఆర్, బీఆర్ఎస్ ముఖ్య నేతలు తప్పుబట్టారు. అలాగే తెలంగాణ కేబినెట్ తీసుకున్న పలు నిర్ణయాలను ఖండించారు.

## అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల

# బండారం బయటపెడతాం

- మాజీ సిఎస్ సోమేశ్ బూబాగోతం కూడా వెల్లడిస్తాం
- కమీషన్ల కోసమే కేసీఆర్ కాళేశ్వరం నిర్మాణం
- బీఆర్ఎస్ నేత విమర్శలపై మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,ఫిబ్రవరి5:** అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల బండిరం బయట పడుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హెచ్చరించారు. ధరణి పేరుతో కోట్లు దోచుకున్నారని.. వారం రోజుల్లో మాజీ సీఎస్ సోమేష్ కుమార్ 5 వేల ఎకరాల భూమి భాగోతం బయటకు వస్తుందని తెలిపారు. కమిషన్ల కోసమే మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. సోమవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... దక్షిణ తెలంగాణను నట్టేట ముంచి.. ప్రస్తుతం ఇక్కడ తాగునీరు లేకుండా కేసీఆర్ చేశారని మండిపడ్డారు. కుర్చీ వేసుకుని ఎస్ఎల్ బీసీ సొరంగం పూర్తి చేస్తామని చెప్పిన కేసీఆర్ ఏనాడూ ఆ ప్రాజెక్టును పట్టించు కోలేదని చెప్పారు. కాళేశ్వరం కంటే ఏడాది ముందు మొదలు పెట్టిన డిండి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కుంగి పోయిందన్నారు. ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డితో కుమ్మక్కై దక్షిణ తెలంగాణను సీఎం కేసీఆర్ నాశనం చేశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ తర్వాత నల్గొండలో మీటింగ్ పెడితే ప్రజల్లో కేసీఆర్‌పై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతోందన్నారు. నల్గొండకు కేసీఆర్ వస్తే ప్రజలు తిరగబడి తరిమి తరిమి కొడతారని హెచ్చరించారు. బస్సులో వస్తే రోడ్లపై ఆపి కొడతారని.. మిలిట్రీను తెచ్చుకున్నా సరే.. కేసీఆర్‌కు ప్రజల చేతిలో పరభావం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ ప్రజలకు చేసిన మోసాలకు కేసీఆర్, హరీష్ రావు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. నల్గొండ జిల్లాకు కేసీఆర్ చేసింది మామూలు మోసం కాదని..జిల్లాకు జరిగిన అన్యాయం తలచుకుంటేనే తన రక్తం మరిగిపోతోందన్నారు. ఒక్కో ఎమ్మెల్యేను 50, 60 వేల ఓట్లతో ఓడించినా బుద్ధి రాలేదా..? అని ప్రశ్నించారు. చీఫ్ ఇంజనీర్ అయిన కేసీఆర్ ప్రాజెక్టులు ఆగం చేశారని ఆరోపించారు. కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించిందే బీఆర్ఎస్, కేసీఆర్ అని విమర్శించారు. బీఆర్ఎస్ అంటేనే బొందల పార్టీ అని ఎద్దేవా చేశారు. నల్గొండ, భువనగిరి రెండు పార్లమెంట్ స్థానాల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్ రాదన్నారు. మూట ముళ్లే రెడీ చేసుకుని దుబాయ్ వెళ్లేందుకు కేసీఆర్ స్పెషల్గ ÷÷-లట్ రెడీ చేసుకున్నారని సెటైర్లు వేశారు. తెలంగాణలో నీటి ప్రాజెక్టుల విషయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటలయుద్ధం నడుస్తోంది. కేఆర్ఎంబీకు కాంగ్రెస్ ప్రాజెక్టులను అప్పగించిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కేసీఆర్ నీటి ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని ఆదివారం నాడు సీఎం రేవంత్ రెడ్డి సమావేశంలో నిప్పులు చెరిగారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏపీకు మేలు జరిగేలా చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు గులాబీ పార్టీ నేతలు ప్రతి ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పేదల సంక్షేమం లక్ష్యంగా జగన్ పాలన

- బడుగు,బలహీరవర్గాల అభ్యున్నతికి కృషి
- సంక్షేమ పథకాల అమలుతో అన్ని వర్గాలకు లబ్ధి
- పేదరికం 11.25 శాతం నుంచి 4.1 శాతానికి తగ్గింది
- విద్యా రంగంపై రూ.73,417 కోట్లు ఖర్చు
- అమ్మఒడి ద్వారా 83 వేల మంది విద్యార్థులకు మేలు
- నాడునేడుతో ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు
- ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం



**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి,ఫిబ్రవరి5:** జగన్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని.. సామాజిక న్యాయం, సమానత్వం కోసం పని చేస్తోందని శాసనసభను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. నవరత్నాల ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోంది. సంక్షేమ పథకాల అమలుతో అన్ని వర్గాలు లబ్ది పొందాయన్నారు. పేదరికం 11.25 శాతం నుంచి 4.1 శాతానికి తగ్గిందన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. శాసన మండలి, శాసనసభను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. విద్యా రంగంపై రూ.73,417 కోట్లు ఖర్చు చేశాం. మన బడి, నాడు - నేడు ద్వారా స్కూళ్ల రూపురేఖలు మార్చాం. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా సంస్కరణలు తెచ్చాం. పేద పిల్లలకు గ్లోబల్ ఎడ్యుకేషన్ అందిస్తున్నాం. జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నాం. ఇందు కోసం రూ.4,417 కోట్లు ఖర్చు చేశాం. అమ్మఒడి ద్వారా 83 వేల మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది. జగనన్న విద్యా కానుక కోసం ఇప్పటివరకూ రూ.3,367 కోట్లు ఖర్చు చేశాం. డిజిటల్ లెర్నింగ్ లో భాగంగా 8, 9 తరగతుల విద్యార్థులకు 9,52925 ట్యాబ్స్ పంపిణీ చేశాం. వచ్చే ఏడాది జూన్ 1 నుంచి ఒకటో తరగతి నుంచి ఐబీ విధానం ప్రవేశ పెడతాం. మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా విద్యా బోధన ఉంటుందని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలో 10,132 విలేజ్ హెల్త్ క్లినిక్స్, 1,142 పీహెచ్సీలు, 177 కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ ఏర్పాటు చేశాం. నాడు - నేడు ద్వారా ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ఇప్పటివరకూ 53,126 మంది వైద్య సిబ్బందిని నియమించాం. ఇప్పటివరకూ 1.3 కోట్ల గ్రామీణ రోగులకు ఇంటి వద్దే సేవలందిం చాం. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా జగనన్న ఆరోగ్య సురక్షను అమలు చేస్తున్నాం అని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. అలాగే, రైతులు రాష్ట్రానికి వెన్నెముక అని.. రాష్ట్రంలో 10,778 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామని.. 53.53 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద రూ.33 వేల కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామని అన్నారు. రొయ్యల ఉత్పత్తిలో 75 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ ఆక్వా హబ్ ఆఫ్ ఇండియాగా పేరొందిందని గవర్నర్ నజీర్ అన్నారు. 'రూ.50.30 కోట్లతో 35 ఆక్వా ల్యాబ్స్ ఏర్పాటు చేశాం. ఆక్వా రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రతీ కుటుంబానికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. దేశంలో మొత్తం చేపల ఉత్పత్తిలో 30 శాతం వాటాతో ఏపీ మొదటి స్థానంలో ఉంది. వేటకు వెళ్లి మత్స్యకారులు చనిపోతే రూ.10 లక్షల పరిహారం ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళా సాధికారత, శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని గవర్నర్ తెలిపారు. 'వైఎస్సార్ ఆసరా ద్వారా 78.84 లక్షల మంది మహిళలకు రూ.25,571 కోట్లు అందించాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా 6.4 లక్షల మంది గర్భిణీలు, 28.62 లక్షల మంది పిల్లలకు లబ్ధి కలుగుతోంది. వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా 66.43 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నాం.' అని చెప్పారు. అలాగే, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని.. ఇప్పటివరకూ 74.01 శాతం పనులు పూర్తైనట్లు చెప్పారు. అవుకు ప్రాజెక్ట్ రెండో టన్నెల్ పూర్తి చేశామని పేర్కొన్నారు. పులిచింతల నిర్వాసితులకు రూ.142 కోట్లు చెల్లించినట్లు వివరించారు. రాష్ట్రంలో ఐటీ, విమానయాన, పర్యాటక రంగంలో వృద్ధి సాధించామని గవర్నర్ తెలిపారు. మరో 30 నెలల్లో భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. 'ఐటీ రంగాన్ని ప్రోత్సహించేలా ఐటీ పాలసీ ప్రవేశపెట్టాం. 200 ఎడబ్ల్యు డేటా సెంటర్ కోసం రూ.14,694 కోట్లు పెట్టుబడి. మధురవాడలో ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్ ఏర్పాటు చేశాం. పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక పాలసీ తెచ్చాం. 7,290 మందికి ఉపాధి కల్పించేలా రూ.3,685 కోట్ల పెట్టుబడితో చర్యలు చేపట్టాం.' అని వివరించారు. విజయవాడలో ప్రపంచంలోనే ఎత్తైన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరిగిందని.. ఇది అభినందనీయమని గవర్నర్ అన్నారు. 18.8 ఎకరాల్లో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రూ.404.35 కోట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. దీని ఏర్పాటుపై సీఎం జగన్, రాష్ట్ర అధికార యంత్రాంగాన్ని అభినందిస్తున్నామని అన్నారు. చివరగా.. బాపూజీ మాటలతో గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.

## విశ్వాస పరీక్షలో నెగ్గిన చంపై సోరెన్ సర్కార్.. ఓటింగ్‌కు హాజరైన మాజీ సీఎం..



**నేటి ఫోకస్ న్యూస్, జార్ఖండ్:** ఉత్కంఠ భరితంగా సాగిన జార్ఖండ్ అసెంబ్లీ బలపరీక్షలో సీఎం చంపై సోరెన్ నెగ్గారు. దీంతో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభానికి తెరపడింది. అసెంబ్లీలో విశ్వాస పరీక్షకు మద్దతుగా 47 మంది ఎమ్మెల్యేలు ఓటేశారు. వ్యతిరేకంగా 29 మంది ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు ఓటేశారు. హేమంత్ సోరెన్ సీఎం పదవికి రాజీనామా చేయడంతో కొత్తగా సీఎంగా ప్రమాణం చేసిన చంపై సోరెన్ ఇవాళ బలపరీక్ష నిరూపించుకున్నారు. కాగా.. భూ కుంభకోణం కేసులో ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీలో ఉన్న హేమంత్ సోరెన్ రాజీనామా చేయడంతో 81 మంది సభ్యుల అసెంబ్లీలో చంపై సోరెన్ మెజారిటీని నిరూపించుకోవాల్సి వచ్చింది. ఫ్లోర్ టెస్ట్ నేపథ్యంలో హేమంత్ సోరెన్‌ను ఈడీ అసెంబ్లీకి తీసుకొచ్చింది. బలపరీక్షకు ముందు అసెంబ్లీలో మాట్లాడిన చంపై సోరెన్ ప్రజల మద్దతుతో ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. చంపై సోరెన్.. హేమంత్ సోరెన్ 2.0 అంటూ అభివర్ణించారు. కాగా.. హైదరాబాద్ నుంచి నిన్న రాత్రి రాంచీ చేరుకున్న కూటమి ఎమ్మెల్యేలతో సీఎం చంపై సోరెన్ ఈ ఉదయం అసెంబ్లీకి చేరుకున్నారు. ఎమ్మెల్యేలకు బీజేపీ గాలెం వేస్తుందన్న ఊహాగానాల మధ్య.. జేఎంఎం-ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమి తమ ఎమ్మెల్యేలను హైదరాబాద్ రిసార్ట్‌కు పంపింది. అనంతరం ఆదివారం రాత్రి రాంచీకి చేరుకుని అసెంబ్లీకి హాజరయ్యారు. అసెంబ్లీలో హేమంత్ సోరెన్ మాట్లాడుతూ.. జనవరి 31 నాటి పరిణామాలను బ్లాక్ డేగా అభివర్ణించారు. జనవరి 31న ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేయడాన్ని దేశం తొలిసారిగా చూసిందని, ఈ కుట్రలో రాజ్‌భవన్ హస్తం ఉందని ఆరోపించారు. తన అరెస్టుకు సంబంధించిన స్క్రిప్ట్‌ను చాలా ప్లాన్‌గా రచించారని అన్నారు. భూ కుంభకోణంలో తన ప్రమేయం ఉందని రుజువు చేస్తే ఆ రోజు రాజకీయాల నుంచి తప్పుకుంటానని హేమంత్ సోరెన్ చెప్పారు. గిరిజనులపై కుట్ర పన్నారని, గిరిజన సీఎం అయిదేళ్లు పూర్తికాకుండానే దించాలనుకున్నారని మాజీ సీఎం ఆరోపించారు. 8.3 ఎకరాల భూమి తనదేనని రుజువు చేసే సాక్ష్యాలను ఎవరైనా సమర్పిస్తే రాజకీయ పదవి నుంచి వైదొలగేందుకు సిద్ధమని హేమంత్ సోరెన్ తెలిపారు. 2000ల నుంచి జార?ండ్‌ను ఎవరు పాలిస్తున్నారో తమకు తెలుసని.. ఇంతకు ముందు ఎలాంటి కుంభకోణాలు జరగలేదని వారు చెప్పారని గుర్తుచేశారు. కాగా.. ఫిబ్రవరి 2న, చంపాయ్ సోరెన్ జార?ండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. జార?ండ్ అసెంబ్లీలో తన కూటమి మెజారిటీని నిరూపించుకోవడానికి ఫిబ్రవరి 5 వరకు సమయం ఇచ్చారు. 81 స్థానాలున్న జార?ండ్ అసెంబ్లీలో జార?ండ్ ముక్తి మోర్చాకు 29 సీట్లు, దాని మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు 17, ఆర్జేడీ, సీపీఐ (ఎంఎల్)లకు ఒక సీటు చొప్పున ఉన్నాయి. గత నెలలో జేఎంఎం ఎమ్మెల్యే ఒకరు రాజీనామా చేశారు.

నేటి ఫోకస్ న్యూస్

3

మంగళవారం 06 ఫిబ్రవరి 2024

## చెస్ విజేతలను అభినందించిన ఎమ్మెల్యే బి ఎల్ ఆర్



**నేటి ఫోకస్ న్యూస్ మిర్యాలగూడ ఫిబ్రవరి 5 :** మిర్యాలగూడ పట్టణానికి చెందిన బాల, బాలికలు ఇటీవల సూర్యాపేటలో జరిగిన జిల్లాస్థాయి చెస్ క్రీడలలో వివిధ విభాగాలలో గెలుపొంది పతాకాలు సాధించారు. ఈ విద్యార్థులు సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గెలుపొందిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. చెస్ క్రీడలో మరింత రాణించి పేరు తీసుకురావాలి అన్నారు. చెస్ బుద్ధి బలాన్ని మేధాశక్తిని పెంపొందిస్తుంది. కావున చదువుకునే విద్యార్థులు కచ్చితంగా చెస్ నేర్చుకొని ఉండాలి. చెస్ లో ఎత్తుకు పైఎత్తులు వేయడం వెదుటి వ్యక్తి యొక్క ఎత్తులనే ముందే పసిగట్టడం ఇలా చెస్ మీ జీవన విధానాన్ని, సమాజంలో ఎలా ఒదిగి ఉండాలి అనే విషయాన్ని తెలియజేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బాలాజీ నాయక్, చెస్ కోచ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తున్న నేతలు !

మరోమారు ఎన్నికలకు వెళుతున్నాం. ఐదేళ్లకోసారి ఎన్నికలు జరుగుతున్నాయి. కొత్త పాలకులు వస్తున్నారు. కానీ పాలనలో మాత్రం మార్పు కానరావడం లేదు. యధారాజా ..తథా ప్రజా అన్నచందంగా కేంద్రం బాటలోనే రాష్ట్రాలు నడుస్తున్నాయి. ఎంత వెనకేసుకుందామా అన్నదే అందిర లక్ష్యం అయ్యింది. రాజ్యాంగ స్ఫూర్తికి విగాతం కలిగేలా పాలకులు వ్యవహరిస్తున్నారు. ఇలా ఎన్నిసార్లు ఎన్నికలు వచ్చినా పాలకుల్లో చిత్తశుద్ధి లేని కారణంగా ప్రజల జీవన విధానంలో మార్పులు రావడం లేదు. నిరుద్యోం తీరడం లేదు. నిజానికి భారత రాజ్యాంగం ఈ దేశ ప్రజలందరినీ సమస్కంధులుగా, సమాన వాటాదారులుగా ప్రకటించింది. అయినప్పటికీ ఇంకా ఇన్ని కోట్లమంది ప్రజలు నిస్సహాయులుగా నిరుపేదలుగా మిగిలి పోవడానికి కారణం ఏమిటి? ఇది రాజ్యాంగం లోపమా.. లేక నాయకుల లోపమా అన్నది చర్చించాలి. భారత రాజ్యాంగాన్ని మార్చాలన్న ప్రతిపాదనలపై రాజకీయా పార్టీల నేతలు చర్చించాలి. ఎక్కడ వైఫల్యం చెందుతున్నామో గుర్తించాలి. రాజ్యాంగ ఇంతకాలం కేవలం రాజకీయనాయకుల అవసరాలను మాత్రమే తీర్చింది. పెత్తందారీలకు మాత్రమే మేలు చేసింది. బడాబాబులను మరింత పెద్దవారుగా ఎదగడానికి దోహదపడింది. సామాన్యులు సామాన్యులగానే ఉండి పోయారు. విద్య,ఉద్యోగం,వైద్యం వంటి వాటిల్లో ఖచ్చితమైన హామీని పొందలేకపోయారు. ఇవన్నీ చర్చించాల్సిన సమయం ఇప్పుడు వచ్చింది. రాజ్యంగం లో ఉన్న అంశాలను చర్చించాలి. ఎక్కడ మనం విఫలం అయ్యమో చర్చించాలి. కారకులు ఎవరో తేల్చాలి. రాజ్యాంగం అంటూ మార్చాల్సి వస్తే రాజకీయ నాయకుల పెత్తనం లేకుండా ఉండేలా చూసుకోవాలి. రాజ్యాంగం అంటే శిలాశాసనంగా ఉండాలి. దానిని కాదని పక్కకు తొలగితే ఉరివేసే విధంగా శిక్షలు ఉండాలి. భయం ఉంటే తప్ప ప్రజలకు న్యాయం జరగదు. నిజానికి రాజ్యాంగాన్ని ప్రజలకు అనుగుణంగా మార్చాల్సిన అవసరంపై చర్చచేయాలి. కేవలం కొన్ని చట్టాలను మార్చడం వల్ల లాభం లేదు. రాజకీయ నాయకుల అభీష్టం మేరకు కాకుండా ప్రజల ఆలోచనలకు అనుగుణంగా, సమాజాంలో అసవరాలకు అనుగుణంగా..మారిన ప్రపంచగతికి అనుగుణంగా మన రాజ్యాంగంలో మార్పులపై చర్చించాల్సి ఉంది. ఒకే వ్యక్తి జీవిత పర్యంతం పదవులను పట్టుకుని వేలాడే పద్దతి పోవాలి. రిజర్వేషన్లు ఒకే కుటుంబంలో జీవితాంతం అనుభవించే దశ పోవాలి. 130 కోట్ల మందికి అనుగుణంగా రాజ్యాంగం మారాలి. అంతరికీ సమాన ఫలాలు దక్కేలా చట్టాలు ఉండాలి. రిజర్వేషన్ల ఫలాలు అన్ని కుటుంబాలకు వరుసగా అందాలంటే ఒక్కో కుటుంబానికి గరిష్టంగా రెండు పర్యాయాలు మాత్రమే దక్కాలి. రాజకీయంగా కూడా రిజర్వేషన్లు రావాలి. సర్పంచ్ మొదలు ఎంపిలు, ఎమ్మెల్యేల వరకు ఒక వ్యక్తి రెండు పర్యాయాలకు మించి పదవిలో ఉండకుండా.. అమెరికా తరహాలో రిజర్వేషన్లు ఉండాలి. అప్పుడు ప్రజలకు మరిన్ని అవకాశాలు వస్తాయి. మేధావుల సమక్షంలో ప్రజల అభీష్టం మేరకు మార్పులు,చేర్పులపై క్షేత్రస్థాయిలో చర్చించాలి. ప్రజల నుంచి సూచనలు స్వీకరించాలి. ప్రస్తు రాజ్యాంగం మూలాలను విడవకుండా పటిష్ట రాజ్యాంగాన్ని పునర్ రచించుకునేందుకు సిద్దపడాలి. అలా చేయడం ద్వారా ప్రజలకు రాజ్యాంగ రక్షణ దక్కగలదు. నిరంతరా యంగా రాజకీయ నేతలు పదవులు పట్టుకుని వేలాడడం వల్లనే రాజ్యాంగం అపహాస్యం అవుతోంది. పేదలకు రక్షణ కల్పించలేకపోతున్నది. రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా పాలన చేస్తున్నారు. తాము చెప్పిందే రాజ్యాంగం అన్నరీతిలో సాగుతున్నారు. అందరికీ సమాన స్థాయిలో నాణ్యమైన విద్య, వైద్యం, ఉద్యోగ,ఉపాధి అవకాశాలను అందివ్వలేకపోవడం వల్ల రాజ్యాంగం అపహాస్యం అవుతోంది. ఇది రాజకీయ నాయకుల కురుచ బుద్ది వల్ల, స్వార్థం వల్ల, అధికార యావ వల్ల అని తేలింది.అందుకు కారణం రాజకీయాలే అని విద్యావేత్తలు, ఆర్థిక నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు ఇప్పుడు ఆందోళన చెబుతు న్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తి కొరవడింది. అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టి ఆ మహానుభావుడి స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారు. దరికంపై విజయం సాధించ గలిగే చర్యలు జరగడంలేదు. నిర్ణయాలు ఉండడం లేదు. ప్రజలందరికీ నాణ్యమైన విద్యను అందించలేని జాతీయ విద్యావిధానం అవసరమా అన్నది చర్చించాలి. ఉద్యోగాలు కల్పించలేని చదువులు అవసరమా అన్నది చర్చించాలి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన దగ్గర్నుంచీ లెక్కలేసుకుంటే ప్రజలకన్నా వ్యాపారులు, కార్పోరేట్లు, రాజకీయ నేతలే బాగు పడ్డారు. వారికోసం ప్రజల జీవితాలను పణంగా పెడుతూ వస్తున్నారు. ఓట్లను కొల్లగొట్టి అధికారం చెలాయిస్తున్నారు. నీతి వాక్యాలు ప్రవచిస్తున్న రాజకీయ నాయకులు అంతా ఇందుకు అతీతం కాదు. రాజ్యాంగం పటిష్టంగా ఉండి..రాజకీయ నాయకుల పెత్తనం లేకుంటే ఇలా అనర్థాలు జరిగేవా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. పాలకులు అంటే పన్నులు వేయడం..తాము అనుకున్న పనులు చేసుకోవడం... దర్జాగా ఎసి గదుల్లో సుఖాలు అనుభవించడం.. ప్రత్యేక విమానాల్లో విహారాలు చేయడం వంటివన్నీ ప్రజల జీవితాలను పణంగా పెట్టి చేయాల్సిన ఆగత్యం ఉందా అన్నది ఆలోచనచేయాలి. గత కొన్నేళ్లు పార్లమెంట్ సమావేశాలు సరిగా సాగడం లేదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం,మద్దతు ధరలు,రైతుల సమస్యలు, కరోనా సమస్యల గురించి చర్చ చేయాల్సి ఉన్నా చేయడం లేదు. మన రాజ్యాంగం పటిష్టంగా ఉన్నా వీటిపై చర్చ జరగక పోవడానికి గల కారాణాలు ఏమిటన్నది ముందు చర్చించాలి. అంటే రాజకీయపెత్తనమే దీనికి కారణమని అర్థం అవుతోంది. ఇలా జరగడం అసవరమా అన్నది ముందుగా ఆలోచనచేయాలి. ఇందుకు గల కారాణాలను చర్చించడంలో తప్పు లేదు.

# మిర్యాలగూడలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి

**నేటి ఫోకస్ న్యూస్ మిర్యాలగూడ ఫిబ్రవరి 5 :** మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సోమవారం మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ కి తెలంగాణ యువజన సంఘం అధ్యక్షులు సుంకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో ప్లాస్టిక్ నిషేధం ఉన్నప్పటికీ ప్లాస్టిక్ వాడకాన్ని కొనసాగిస్తున్నారని, మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ డిస్పోజలను, చెత్తను రోడ్లపై వేస్తూ మురికి కాలువల్లో పడేస్తూన్నారన్నారు. ప్లాస్టిక్ వాడటం వల్ల జంతు జీవ ప్రాణులు అనారోగ్యాల బారిన పడుతున్నయని, మానవ జీవ ప్రాణులకు కావలసినటువంటి గాలిని కలుషితమై అనారోగ్య బారిన ప్రజలు పడుతున్నారని, మురికి కాలువలలో ప్లాస్టిక్ చెత్త చెదారం వేయడం వల్ల మురికి కాలువలు ఎక్కడికక్కడే నిండిపోయి దుర్వాసన వెదజల్లడంమే కాకుండా స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని వాపోయారు. అదేవిధంగా మిర్యాలగూడ పట్టణంలోని షాపు యాజమాన్యాలు కూడా ఎక్కడపడితే అక్కడ రోడ్లపై చెత్తను మురికి కాలంలో రోడ్లపైనే వేస్తున్నారని,ఈ విధంగా వేయడం వల్ల మురికి కాలువలు జామై దుర్వాసన వెదజల్లి దోమల బెడద ఎక్కువగా ఉండటం వల్ల విష జ్వరాలు ప్రజలకు ప్రబలుతున్నాయని ఇటువంటి షాపుల వారిపై మున్సిపల్ సిబ్బంది టీం తోను ఏర్పాటు చేసి చెత్త, చెదారం, వేసే షాపులపై జరిమానా విధించడం, ప్లాస్టిక్ కవర్లు వాడే షాపులపై నోటీసులు జారీ చేసి వాటిని అమ్మకుండా చేయాలన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ, సాగర్ రోడ్డు, ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర మురికి కాలువలలో చెత్త చెదారం భారీగా పేరకపోతుందని



ఎప్పటికప్పుడు వాటిని శుభ్రం చేయాలని, మున్సిపల్ సిబ్బందిని పెంచి, మిర్యాలగూడ పట్టణంలో చెత్తను, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని మురికి కాలువలో చెత్త పేరకపోకుండా ఎప్పటికి అప్పుడు శుభ్రం చేయాలని విష జ్వరాల బారి నుండి పట్టణ ప్రజలను కాపాడాలని కోరడమైనది. ఈ కార్య క్రమంలో తెలంగాణ యువజన సేవా సంఘం ఉపాధ్యక్షుడు చేగొండి మురళి యాదవ్, చిమట ఎర్రయ్య యాదవ్, జావజి సత్యనారాయణ, బిక్షాలు, గంగరాజు, కిరణ్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్‌తో ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్):** ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ ను వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు.నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.సాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని పంటల సాగుపై వ్యవసాయ అధికారులను అప్రమత్తం చేయాలని ఆయన కోరారు.వ్యవసాయ శాఖ పరంగా రైతులకు అందించే రాయితీ విత్తనాలను ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆయన కలెక్టర్ ను కోరారు. ప్రత్యేక అధికారుల పాలనలో ఎక్కడ ఎలాంటి సమస్య లేకుండా పర్యవేక్షణ ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.



## అనారోగ్య బాధితులకు ఎల్ఓసిలు అందజేసిన ఎమ్మెల్యే మెగారెడ్డి



**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్):** పలు రకాల జబ్బులతో హైదరాబాదులోని నీమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురికి సోమవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఎల్ ఓ సి లను అందజేశారు.వనపర్తి పట్టణం రాంనగర్ కు చెందిన విజయలక్ష్మికి ఒక లక్ష యాభై వేలు, బండ రవి పాకుల గ్రామానికి చెందిన బాలస్వామికి 2 లక్షలు, రాజపేటకు చెందిన అఖిలకు ఒక లక్షా ఎనభై వేలు, మహమ్మద్ హుస్సేన్ పల్లికి చెందిన సత్యనారాయణకు 2 లక్షల 50 వేలకు సంబంధించిన ఎల్ ఓ సి లను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు.

## రైలు సాధనకై ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

- ఎన్ఆర్ఎస్ఎస్ నాగర్ కర్నూల్ పొలిటికల్ జేఏసీ ఇంచార్జ్ ధన్నోజు అరవింద్ చారి

**నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి జయశంకర్ పిబ్రవరి 5:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం రోజున అంబేద్కర్ చౌరస్తాలో రైల్వే సాధనకై ఏర్పాటు చేసిన పోస్టర్స్ విడుదలకు ముఖ్య అతిథిగా ఎన్ ఆర్ ఎస్ ఎస్ ఉపాధ్యక్షులు నీలం కృష్ణ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ రైలు సాధనకై ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్లు విడుదల



చేయడం జరిగింది, దీనిలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా ఎన్ ఆర్ ఎస్ ఎస్ ఇన్చార్జ్ దన్నోజు అరవింద్ చారి ఈ సందర్భంగా మాట్లాడుతూ వనపర్తి, గద్వాల మాచర్ల, ఆరేపల్లి కడుకుంట్ల, గోపాల్ పేట నాగర్ కర్నూల్ కల్వకుర్తి దేవరకొండ మీదుగా డోర్నకల్ వరకు రావాలని గత 40 సంవత్సరాలుగా పోరాటం జరిగిందని మధ్యలో కొన్ని అనివార్య కారణాల వలన ఉద్యమం ఆగిందని మళ్లీ ఇప్పుడు ముకురాల శ్రీహరి ఆధ్వర్యంలో ఉద్యమం ఉదృతం చేస్తామని అన్నారు. గతంలో గెలిచిన ఎంపీలు గెలవకముందు రైల్వే లైన్ వేయిస్తామని హామీ ఇచ్చి పార్లమెంటులో మాట్లాడకపోవడం దురదృష్టకారం అన్నారు, ఎంపీ ఎలక్షన్లు సమీపిస్తుండటంతో అబద్ధపు హామీలు ఇస్తే ప్రజలు ఊరుకునే సమస్య లేదని ఓటు ద్వారా బుద్ధి చెబుతారని అన్నారు జరగబోయే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ కేటాయింపు జరగాలని అన్నారు దీనికి అన్ని రాజకీయ పార్టీ ల మద్దతు ఉద్యోగస్తుల మద్దతు ప్రజా సంఘాల మద్దతు అన్ని సామాజిక వర్గాల మద్దతు కావాలని ఎవరైతే రైల్వే లైన్ గురించి నాగర్ కర్నూల్ జిల్లాకు కచ్చితంగా హామీ ఇస్తారో వారికి ఎన్ ఆర్ ఎస్ ఎస్ మద్దతు ఉంటుందని ఎన్ ఆర్ ఎస్ ఎస్ నాగర్ కర్నూల్ జిల్లా ఇంచార్జ్ దన్నోజు అరవింద్ చారి అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నీలంకృష్ణ బి,రమేష్ ఎం శ్రీను సూర్యనారాయణ, కృష్ణమోహన్, మల్లేష్ మరియు ఎన్ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నిమ్స్ మేలో రుణమేళ

**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు ఫిబ్రవరి 05:** బోనకల్ సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ప్రారంభించాలనే వారి కోసం యూసుఫ్ గూడ లోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయినటువంటి నిమ్స్ మేలో ఫిబ్రవరి 7 రుణమేళ నిర్వహించనున్నారు. ఉదయం



9:30 నుండి సాయంత్రం 4:00 వరకు కొనసాగే అవగాహన కార్యక్రమంలో ప్రాజెక్టు నివేదిక తయారీ రుణం పొందే ప్రక్రియ వాటికి అవసరమైన పత్రాలు తదితర అంశాలను వివరించనున్నారు. ప్రముఖ ప్రభుత్వ రంగ ప్రైవేటు బ్యాంకు ప్రతినిధులు ఈ రుణమేళాలో పాల్గొంటారని నిర్వాహకులు తెలియజేశారు. ఈ యొక్క అవకాశాన్ని గ్రామీణ ప్రాంత యువత సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఇతర వివరాలు ఉచిత రిజిస్ట్రేషన్ కొరకు 04023633244/218/261 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని వారు తెలియజేశారు.

## యాదవుల సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తా

- ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి




**నేటి ఫోకస్ న్యూస్, రామంతాపూర్:** సోమవారం రామంతపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు అదేవిధంగా తన గెలుపుకు కృషి చేసిన యాదవ సంఘానికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాయకులు సర్వ బాబు యాదవ్ యాదవ్ సంఘం నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన డా.కోట రాంబాబు



**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు ఫిబ్రవరి 05:** బోనకల్ మండలం పెద్ధబీరువల్లి గ్రామానికి చెందిన యండ్రాతి వెంకటేశ్వర్లు నిన్న బోనకల్ లో జరిగిన రోడ్ ప్రమాదంలో అకాల మరణం పొందగా వారి మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డా.కోట రాంబాబు నివాళులు అర్పించారు. వారి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయం అందించారు.రాంబాబు వెంట గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## గిరిజన సేవా సంఘం నూతన అధ్యక్ష,ప్రధాన కార్యదర్శుల ఎంపిక

**అచ్చంపేట నియోజకవర్గం (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి) ఆర్ భరత్ ఫిబ్రవరి05:** అచ్చంపేట నియోజకవర్గం లోని ఉన్న గిరిజన ప్రజా ప్రతినిధులు ఉద్యోగస్తులు యువతి యువ కులు సుమారు 500 మందితో అచ్చంపేట పట్టణంలోని గిరిజన భవనం దగ్గర సమావేశం ఏర్పాటు చేసి గిరిజన సేవా సంఘం వ్యవస్థాపకులు అయినా



బిచ్చ నాయక్ , రాములు నాయక్, తులసి రామ్ నాయక్, రాములు నాయక్,శ్రీరామ్ నాయక్,గోపాల్ నాయక్,జైపాల్ నాయక్ వారి ఆధ్వర్యంలో నూతన గిరిజన సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిల ఎన్నిక నిర్వహించగా అధ్యక్ష పదవికి 19 మంది పోటీ ఉండగా వారందరిని సమన్యాయం చేసి లచ్చు నాయకులు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది మరియు ప్రధాన కార్యదర్శి కి 18 మంది పోటీలో ఉండగా వారందరిని సమన్యాయం చేసి రాత్లావత్ దగ్నానాయక్ ను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యవర్గం గిరిజనుల సమస్యల పైన మరియు గిరిజనుల అభివృద్ధి పైన పాటుపడి పని చేయాలని అదేవిధంగా ఈ నూతన కార్యవర్గము రెండు సంవత్సరాల పాటు పనిచేసి తదానంతరము మళ్లీ అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక ఉంటుంది అని తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని గిరిజనులు పాల్గొనడం జరిగినది.

## రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు



**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్):** జిల్లా సహకార సంఘాల ద్వారా రుణాలు పొందిన రైతులను అధికారులు ఇబ్బందులకు గురి చేయకూడదని ప్రభుత్వ ఆదేశాలు పాటించాలనీ జిల్లా సహకార సంఘాల అధికారులకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి సూచించారు.సోమవారం వనపర్తి జిల్లా సహకార కార్యాలయంలో ఆయన జిల్లా పరిధిలోని 15 సంఘాల కార్యదర్శులు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే రికవరీలు చేపట్టాలని ఎక్కడ రైతులను ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకార సంఘాల ద్వారా ఎరువులు విత్తనాలు వ్యవసాయ ఉపకరణాలను రాయితీపై అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. అర్హత గల వారికి రుణాలను మంజూరు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రఘునాథరావు పర్యవేక్షకులు శ్రీనివాసులు 15 సంఘాల కార్యదర్శులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఎఫ్-2 కాంబోలో
# అనిల్ రావిపూడి కొత్త చిత్రం



దర్శకుడు అనిల్ రావిపూడి మరోమారు తన పాత కాంబోనో రాబోతున్నాడు. బాలకృష్ణ తో 'భగవంత్ కేసరి' అనే విజయవంతమైన సినిమా చేసాడు. తరువాత అనిల్ రావిపూడి ఎవరితో చేస్తున్నాడనే విషయంపై ఇప్పుడు ఒక క్లారిటీ వచ్చింది. తన తదుపరి సినిమా వెంకటేష్ కథానాయకుడిగా చేస్తున్నాడు అని తెలిసింది. అయితే ఇందులో ఇంకొక కథానాయకుడిగా వరుణ్ తేజ్ కూడా నటిస్తున్నాడని అంటున్నారు. అయితే ఈ సినిమా మాత్రం 'ఎఫ్ 2' సినిమాకి సీక్వెల్ మాత్రం కాదంటున్నారు. ఎందుకంటే ఇంతకు ముందు వెంకటేష్, వరుణ్ తేజ్ ఇదే అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'ఎఫ్ 2' అనే సినిమాలో నటించారు అది చాలా పెద్ద హిట్ అయిన విషయం కూడా తెలిసిందే. ఆ తరువాత ఆ సినిమాకి సీక్వెల్ గా 'ఎఫ్ 3' కూడా వచ్చింది కానీ, అది 'ఎఫ్ 2' అంత విజయవంతం కాలేదు. ఇప్పుడు మళ్ళీ వెంకటేష్, వరుణ్ తేజ్ అనగానే ఆ సినిమాలకి సీక్వెల్ గా ఉంటుంది అని అనుకుంటున్నారు, కానీ ఇది పూర్తిగా దానికి భిన్నమైన కథ అని తెలిసింది. అందుకే ఆ సినిమాకి ఇది సీక్వెల్ కాదు అని అంటున్నారు. ఈ సినిమాకి కూడా దిల్ రాజు నిర్మాత అనే తెలిసింది. వెంకటేష్ తాజా చిత్రం 'సైంధవ్' సంక్రాంతికి విడుదలైంది, బాక్స్ ఆఫీస్ దగ్గర డిజాస్టర్ కూడా అయిన విషయం తెలిసిందే. ఇంకో పక్క వరుణ్ తేజ్ కి కూడా ఈమధ్య కాలంలో సరైన హిట్ సినిమా లేదు. ఇప్పుడు ఈ ఇద్దరికీ అనిల్ రావిపూడి ఈ సినిమాతో ఒక మంచి విజయం అందిస్తాడని అనుకుంటున్నారు. ఈసారి సంగీత దర్శకుడిగా భీమ్స్ సిసిరోలియో ని తీసుకుంటున్నట్టుగా సమాచారం.

# విశ్వంభరలో చిరు సరసన త్రిష


మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'విశ్వంభర'. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ సినిమాకు బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్నాడు. సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ మూవీ తెరకెక్కుతుండగా యువీ క్రియేషన్స్ సంస్థ సుమారు రూ. 200 కోట్లతో బ్జడెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుంది. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా ఈ చిత్రాన్ని 2025 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. తాజాగా ఈ మూవీ షూటింగ్‌లో చిరంజీవి కూడా జాయిన్ అయ్యాడు. ఇక ఈ సినిమా కోసం చిరంజీవి ఫిజికల్‌గా ఫిట్‌గా తయారయ్యారు. దీనికి సంబంధించి ఇటీవల ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన జిమ్ వీడియో వైరల్‌గా మారింది. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించి సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీలో కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపారు. ఇక 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవితో పాటు త్రిష కూడా జాయిన్ అయినట్లు వెల్లడించారు. 18ఏళ్ల క్రితం చిరంజీవితో 'స్టాలిన్' సినిమాలో నటించింది త్రిష. మళ్లీ ఇన్నాళ్లకు మెగాస్టార్‌తో జతకట్టనుంది. మెగా అభిమానులకు ఇది నిజంగా శుభవార్తే.



# బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చుకున్న రకుల్

తన అందం, అభినయంతో టాలీవుడ్‌తోపాటు బాలీవుడ్‌లో కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్న భామల్లో టాప్‌లో ఉంటుంది రకుల్ ప్రీత్ సింగ్. టాలీవుడ్‌లో అగ్రహీరోలతో నటించిన ఈ ఢిల్లీ భామ ప్రస్తుతం తన దృష్టిని అంతా బాలీవుడ్‌పైనే పెట్టింది. అయితే ఈ భామ త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ నటుడు జాకీ భగ్నానీతో రకుల్ ఈ నెల 21న గోవాలో పెళ్లి చేసుకోబోతుంది. ఈ క్రమంలో రకుల్ ప్రీత్ సింగ్ తన స్నేహితులకు బ్యాచిలర్ పార్టీ ఇచ్చింది. థాయ్ లాండ్ వేడుకగా ఈ బ్యాచిలర్ పార్టీ జరుగగా.. ఈ పార్టీకి టాలీవుడ్ హీరోయిన్స్ ప్రగ్యా జైస్వాల్, సీరత్ కపూర్, మంచు లక్ష్మి తదితరులు హాజరయ్యారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఫిబ్రవరి 21న గోవాలోని ఓ రిసార్ట్‌లో కుటుంబసభ్యులు, స్నేహితులు, సన్నిహితుల సమక్షంలో రకుల్ పెళ్లి గ్రాండ్‌గా జరుగనుంది. ఇదిలావుంటే.. రకుల్ ప్రస్తుతం హిందీలో మేరీ పత్నీ కా రీమేక్‌లో నటిస్తోంది. ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. మరోవైపు తమిళంలో తెరకెక్కుతున్న ఇండియన్ 2 సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తోంది. రకుల్ తెలుగులో చివరగా 2021లో వచ్చిన కొండపొలంలో నటించింది. ఆ తర్వాత హిందీపైనే ఎక్కువ ఫోకస్ పెట్టింది.

# నటి శ్రీదేవి మృతిపై నకిలీ పత్రాలు



అలనాటి అందాల తార శ్రీదేవి మృతిపై నకిలీ పత్రాలు సృష్టించిన ఓ యూట్యూబర్‌పై ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు సీబీఐ అధికారులు తాజాగా వెల్లడించారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు చెందిన దీప్తి అనే మహిళ తాను సోషల్ మీడియాలో ప్రమోట్ అయ్యేందుకు శ్రీదేవి మృతి అంశాన్ని వాడుకున్నట్లు తెలిపారు. శ్రీదేవి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ దీప్తి.. సామాజిక మాధ్యమాల్లో అనేక చర్చలు జరిపింది. ఆ సందర్భంగా ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. శ్రీదేవి మరణంపై తాను సొంతంగా విచారణ జరిపినట్లు తెలిపింది. అందులో యూఏఈ, భారత్ ప్రభుత్వాలు నిజాలను దాచి పెట్టాయని ఆరోపించింది. తన వాదనలకు బలం చేకూర్చేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లేఖలతోపాటు, సుప్రీంకోర్టు, యూఏఈ ప్రభుత్వ డాక్యుమెంట్లను చూపించింది. దీంతో దీప్తిపై ముంబైకి చెందని న్యాయవాది చాందినీ షా.. సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఆమె చూపిన పత్రాలన్నీ నకిలీవని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులో దీప్తి లాయర్ భరత్ సురేశ్ కుమార్ పేరును కూడా చేర్చారు. దీంతో రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు దర్యాప్తు చేపట్టారు.